ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 288

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
15 ఫిబ్రవరి 2026

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## ఓటర్లు కాంగ్రెస్‌ను నమ్మలేదు..

తలసాని శ్రీనివాస్ యాదవ్..



2 లో

# మున్సిపాలిటీల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదే

- ఎక్స్ అఫీషియో ఓట్ల వినియోగంపై జాగ్రత్తగా వ్యవహరించాలి
- మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- సంక్షేమ పథకాలు, ప్రజాపాలనపై నమ్మకానికి పుర ఫలితాలు నిదర్శనమని వెల్లడి
- మున్సిపాలిటీలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపు

2 లో



## ఈశాన్య భారతంలో చరిత్రాత్మక ఘట్టం

- అస్సాంలో తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ' ప్రారంభం
- జాతీయ రహదారిపై దిగిన ప్రధాని మోదీ విమానం
- రన్‌వేను తాకి వెళ్లిన సుఖోయ్, రఫేల్ యుద్ధ విమానాలు



2 లో

## ఇక జనరల్ బోగీల్లోనూ నిరంతరం శుభ్రత

- తొలి దశలో 80 రైళ్లలో ప్రారంభం - మూడేళ్లలో అన్నింటికీ విస్తరణ



# హంగ్ మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్‌కు 17చోట్ల చాన్స్

- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అద్భుత పోరాటం
- విచ్చలవిడిగా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం
- 30కి పైగా మున్సిపాలిటీలు గెలుస్తామనుకున్నం
- ఈ ఎన్నికలు అసెంబ్లీ ఎలక్షన్స్‌కు గీటురాయి కాదు
- మున్సిపల్ ఫలితాలపై కాంగ్రెస్‌లో తీవ్ర అసంతృప్తి
- బీజేపీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నది
- ఎక్స్ అఫీషియో నిబంధనలపై సర్కార్‌కు స్పష్టత లేదు
- మళ్లీ ఫార్ములా-ఈ రేస్ కేసును తెరపైకి తెచ్చే యత్నం
- చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గులాబీ గూటికి బెల్లంపల్లి కాంగ్రెస్ కౌన్సిలర్
- ఇండిపెండెంట్ కౌన్సిలర్ సైతం బీఆర్ఎస్‌లో చేరిక
- బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన బీజేపీ కౌన్సిలర్



2 లో

# మున్సిపాలిటీల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదే

హైదరాబాద్:
హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు 'చే'జిక్కించుకునేలా పకడ్బందీ వ్యూహంతో ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులకు మార్గదర్శనం చేసినట్లు తెలిసింది. 'హంగ్ మున్సిపాలిటీల్లో ప్రతి ఓటూ కీలకం. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు అప్రమత్తంగా ఉండాలి. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి కనబరిచే స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీల వారిని గుర్తించి చేర్చుకోవాలి' అని సీఎం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. శనివారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తదనంతర పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేతలు, మంత్రులతో సీఎం సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినందుకు సీఎం మంత్రులందరినీ అభినందించగా..గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో మున్సిపాలిటీలను కాంగ్రెస్ అభ్యర్థులు నెగ్గినట్లు మంత్రులు గణాంకాలతో వివరించినట్లు సమాచారం. సరైన వ్యూహంతో హంగ్ ఏర్పడిన వాటిని కూడా దక్కించుకుంటే 90 మున్సిపాలిటీలకుపైగా కాంగ్రెస్ వశమవుతాయని వారు వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే మంచి ఫలితాలు సాధించాం. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషిచేసిన కార్యకర్తలకు అభినందనలు. గత భారాస ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను ప్రజా ప్రభుత్వం రెండేళ్లల్లో చేసి చూపించింది. అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలు, ప్రజా పాలనపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాయనేందుకు ఈ ఫలితాలు నిదర్శనం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలి. ఎన్నికలు ఏవైనా ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, వివేక్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశంలో పాల్గొన్నారు. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జూమ్‌లో హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

ప్రతి ఓటూ కీలకమే

విశ్వసనీయ సమాచారం ప్రకారం..హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీలను దక్కించుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలు, మంత్రులతో సీఎం ప్రధానంగా చర్చించారు. ఆయా వ్యూహాలు అమలుచేయడం కోసం.. లోక్‌సభ నియోజకవర్గాల కమిటీల ఛైర్మన్లుగా పార్టీ నియమించిన ఇన్‌ఛార్జి మంత్రితో పాటు మరో మంత్రి లేదా సీనియర్ నేతను ఇన్‌ఛార్జులుగా నియమించారు. వీరంతా తమ పరిధిలోని హంగ్ మున్సిపాలిటీలను దక్కించుకోవడానికి కృషిచేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌కు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ కార్పొరేషన్‌కు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీలను గెలిపించే బాధ్యతను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు, కొత్తగూడెంలో సీపీఐతో సమన్వయం చేసుకుని ఛైర్మన్ పదవిని దక్కించుకునే బాధ్యతను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించినట్లు సమాచారం. కొన్ని మున్సిపాలిటీలో మజ్లిస్, వామపక్షాల కౌన్సిలర్ల ఓట్లు కీలకంగా మారినందున వారితో చర్చించే బాధ్యతలను అక్కడి ఇన్‌ఛార్జి మంత్రులు చూసుకోవాలని సీఎం సూచించారు. 'ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక పూర్తయ్యే వరకూ కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు, మద్దతిచ్చే వారిని వెంటనే హైదరాబాద్ లేదా ఇతర ప్రాంతాల శిబిరాలకు తరలించాలి. ఇప్పటికే శిబిరాలకు తరలించిన వారిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. కాంగ్రెస్ నెగ్గిన వార్డులు ఎన్ని, ఛైర్మన్ పదవి సొంతం చేసుకునేందుకు ఎన్ని ఓట్లు అవసరం అనే దానిపై దృష్టి పెట్టాలి. కొన్నిచోట్ల ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వేసే ఓట్లు కీలకంగా మారినందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి' అని సీఎం సూచించినట్లు తెలిసింది.

# ఓటర్లు కాంగ్రెస్‌ను నమ్మలేదు..



- తలసాని శ్రీనివాస్ యాదవ్
- రాష్ట్రంలో డబ్బు, మద్యాన్ని ఏరులై పారించినా ఆ పార్టీని విశ్వసించలే
- ఆ పార్టీ నేతలు ఎన్ని అక్రమాలకు పాల్పడినా హస్తానికి అత్తెసరు సీట్లే
- కాంగ్రెస్ పార్టీ అసలైన రంగు బయటపడేది అసెంబ్లీ ఎన్నికల్లోనే

సిద్దిపేట, ఫిబ్రవరి14:
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యాన్ని ఏరులై పారించినా ప్రజలు విశ్వసించలేదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం గుడ్డిలో మెల్ల అని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు సహజంగా అధికార పార్టీ వైపు మొగ్గు చూపడం సహజమని తెలిపారు. అయితే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపలేదని అన్నారు.

కేసీఆర్ హయాంలో జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో 95 శాతం సీట్లను బీఆర్ఎస్ గెలుచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 32 జడ్పీ ఛైర్మన్ స్థానాల్లో విజయం సాధించిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో చాలాచోట్ల కాంగ్రెస్ పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడి, చివరికి కౌంటింగ్‌లోనూ అక్రమాలకు పాల్పడి గెలిచిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క కార్పొరేషన్‌లోనూ, మెజారిటీ మున్సిపాలిటీల్లోనూ సంపూర్ణ మెజారిటీ సాధించలేదని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని తెలిపారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా పురోగమిస్తే, కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో కుదేలైందని తలసాని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగునీరు లేక రైతులు పడిన గోసలు చూసిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్టులు నిర్మించినట్టు తెలిపారు.

గతంలో నీరు, విద్యుత్తు లేక రా ష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తాను టీడీపీ ప్రభుత్వంలో మంత్రి, ఎమ్మెల్యేగా పని చేశానని, అప్పు డు నాలుగైదు గంటలకు మించి కరెంట్ ఉండేది కాదని అన్నారు. కానీ, కేసీఆర్ గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు.. రైతులు, వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్టు చెప్పారు. రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని అన్నారు. నాడు భూ ముల ధరలు ఆకాశాన్ని తాకితే, కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన విధానాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ఆందోళన వ్యక్తంచేశారు. నేడు భూములను కోనేవారు లేరని, దీంతో రియల్ ఎస్టేట్‌తోపాటు నిర్మాణ రంగంలో సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు.

# హంగ్ మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు 17 చోట్ల చాన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 :
పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు అద్భుతంగా పోరాడారని, ఫలితాలు గొప్పగా రాని నల్లగొండ జిల్లాలోనూ విజయం కోసం వీరోచితంగా శ్రమించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కితాబునిచ్చారు. ఎన్నికల్లో 30 మున్సిపాలిటీలకు పైగా వస్తాయనుకున్నామని చెప్పారు. కానీ, కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ, అధికార దుర్వినియోగంతో అడ్డదారిలో గెలిచిందని విమర్శించారు. హంగ్ వచ్చిన చోట్ల 17 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు విజయావకాశాలు న్నాయని స్పష్టంచేశారు. శనివారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజాగా జారీ చేసిన ఎక్స్ అఫీషియో మార్గదర్శకాలు, ఫార్ములా -ఈ కార్ రేస్ కేసు తదితర అంశాలపై స్పందించారు.

మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై కాంగ్రెస్ అసంతృప్తిగానే ఉన్నదని, ఆ పార్టీ ఆశించినట్టుగా 75 నుంచి 80 శాతం స్థానాలు గెలుచుకోలేదని చెప్పారు. తాము ఊహించిన దానికంటే బీఆర్ఎస్ శ్రేణులు వీరోచిత పోరాటం చేశారని ప్రశంసించారు. స్థానిక ఎన్నికల్లో లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు. కాంగ్రెస్ మరో మూడేండ్లు అధికారంలో కొనసాగనున్నందున ఆ పార్టీకి ఫలితాలు అనుకూలంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ అప్రతిహతంగా విజయాలు నమోదు చేసిందని గుర్తుచేశారు. రోడ్డు వేస్తారేమోనని, మోరీ కడుతారేమోనని ఆశించి ప్రజలు అధికార పార్టీ వైపు మొగ్గుచూపారని స్పష్టంచేశారు. కానీ మొత్తంగా చూస్తే ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించిందని చెప్పారు. ఓటర్లకు ఎన్నికలపై స్పష్టత ఉంటుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీకి వ్యతిరేకంగా ఓటేసిన వారే ప్రస్తుత ఎన్నికల్లో తిరిగి తమవైపు మళ్లారని ప్రస్తావించారు.

స్థానిక ఎన్నికలు గీటురాయి కాదు

స్థానిక ఎన్నికల్లో అక్కడి సమస్యలు, ఇతర అంశాల ఆధారంగానే ప్రజలు తీర్పు ఇస్తారని, లోకల్‌బాడీ ఎన్నికలు అసెంబ్లీ ఎలక్షన్స్‌కు గీటురాయి కాదని కేటీఆర్ వివరించారు. ఇందుకు ఎన్నో ఉదంతాలున్నాయని ఉదహరించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కుప్పంలో కూడా పోయిందని, చివరికి అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయాలు నమోదు చేసుకున్నదని గుర్తుచేశారు. ఒక ఎన్నికకు, మరో ఎన్నికకు పొంతన ఉండదని అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికల్లో ఒక్కోసారి సానుభూతి కూడా పనిచేయదని చెప్పారు. తన నియోజకవర్గమైన సిరిసిల్లలోని ఓ వార్డులో ఇలాంటి ఫలితమే వచ్చిందని గుర్తు చేశారు. మూడుసార్లు ఓడిపోయిన ఓ మహిళా అభ్యర్థి కాంగ్రెస్ తరఫున బరిలో దిగారని, కానీ ఒక మంచిపేరున్న పిల్లాడిని ఆమెపై పోటీకి పెడితే 70 ఓట్లతో విజయం సాధించాడని చెప్పారు. సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ 20 చోట్ల డిపాజిట్లు కోల్పోయిందని తెలిపారు. 1,800-2,000 ఓట్లు ఉన్న కొన్ని వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు వెయ్యికి పైగా ఓట్లు సాధించారని చెప్పారు.

అడ్డగోలుగా మాట్లాడిన వారికి ఈ ఫలితాలే సమాధానం

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఇక లేవదని అడ్డగోలుగా మాట్లాడిన వారికి మొన్న పంచాయతీ, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ఫలితాలే సమాధానమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తాము లోకల్‌బాడీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించామని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం నాలుగు స్థానాలకే పరిమితమైందని గుర్తుచేశారు. 'రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎం పీగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఎన్ని స్థానాలు గెలిచారు?' అని ప్రశ్నించారు. ప్రస్తుత బల్దియా ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎన్ని డివిజన్లు, మున్సిపాలిటీలు సాధించామో బేరీజు వేసుకోవాలని చెప్పారు. మేడ్చల్‌లో 10 స్థానాలకు ఒక్కటి కూడా కాంగ్రెస్ గెలుచుకోలేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీకి గతం కంటే తక్కువ ఓట్లు

బీజేపీకి గతంలో వచ్చిన ఓట్ల కంటే ప్రస్తుతం తక్కువ వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు. 'బీజేపీ జాతీయ అధ్యక్షుడితో పాటు మహారాష్ట్ర సీఎం, హోం మంత్రి అమిత్‌షా, ఇతర కీలకనేతలను తీసుకొచ్చి ప్రచారం చేయించారు. మంచి ఫలితాలు సాధిస్తామని హడావుడి చేశారు. కానీ ఫలితాలు ఎలా వచ్చాయో మీరందరూ చూస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. జాతీయస్థాయి నేతలతో ప్రచారం చేయించినా ఒక్క మున్సిపాలిటీని కూడా గెలుచుకోలేదని చురకలంటించారు. గతంతో పోలిస్తే ఆ పార్టీ తక్కువ స్థానాల్లో గెలిచిందని, కానీ ఆ పార్టీ నాయకులు ఫర్మామెన్స్ బాగున్నదని చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు 25 శాతం ఓట్లు సాధించామని చెప్పుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గత మున్సిపల్ ఎన్నికలతో పోల్చితే ఆ పార్టీకి 10 శాతం ఓట్లు తగ్గాయని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధినేతలు, పెద్ద లీడర్లు తిరిగితే పెద్దగా ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. స్థానిక అభ్యర్థుల ప్రభావం, అక్కడి సమస్యలు, అధికారంలో ఉన్న పార్టీకి అనుకూల వాతావరణం ఉంటుందని విశ్లేషించారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ విషయంలో సీపీఐ ఎవరితో వెళ్లాలో వారి ఇష్టమని, కాంగ్రెస్‌తో కలిసినా తమకేం ఇబ్బందిలేదని తెలిపారు. అయితే సింగరేణి కార్మికులకు మెసేజ్ ఇచ్చేందుకే సీపీఐకి మద్దతిచ్చేందుకు సిద్ధమయ్యామని స్పష్టంచేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ముఖాముఖి పోటీ నెలకొన్నదని కేటీఆర్ చెప్పారు. బీజేపీ అంతగా ప్రభావం చూపలేదని, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లాంటి చోట్ల మాత్రమే కొంత మెరుగైన ఫలితాలు సాధించిందని గుర్తుచేశారు. వరంగల్‌లో ఆ పార్టీ ప్రభావం నామమాత్రమేనని చెప్పారు. ఖమ్మంలో బీజేపీకి ఏమాత్రం పట్టులేదని స్పష్టంచేశారు. అయితే కొన్నిచోట్ల అభ్యర్థుల బలంతోనే గెలిచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో టికెట్ రాని వారు ఆ పార్టీ తరఫున బరిలో నిలిచి విజయం సాధించారని తెలిపారు.

ఎక్స్ అఫీషియోపై కలెక్టర్లది ఓ మాట..సీఎస్‌ది మరోమాట

మున్సిపల్ అధ్యక్షులు, కార్పొరేషన్ మేయర్ల ఎన్నిక ప్రక్రియలో ఎక్స్ అఫీషియో సభ్యులకు సంబంధించిన ఓటు వినియోగంపై గందరగోళం కనిపిస్తున్నదని, నిబంధనల విషయంలో ప్రభుత్వానికి సైతం స్పష్టతలేదని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఈ అంశంలో కలెక్టర్లు ఓమాట చెప్తే చీఫ్ సెక్రటరీ మరోమాట చెప్తున్నరు. ప్రస్తుత నిబంధనలపై ప్రభుత్వానికి స్పష్టత లేకపోవడం దురదృష్టకరం' అని వాపోయారు.

బీఆర్ఎస్‌లోకి పలువురు కౌన్సిలర్లు

బెల్లంపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. 20వ వార్డు నుంచి గెలిచిన కాంగ్రెస్‌కు చెందిన కుమారస్వామి, 30వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీకి చెందిన 34వ వార్డు కౌన్సిలర్ రామ్మూర్తి కేటీఆర్‌ను కలిశారు. ఆయన ప్రస్తుతానికి బీఆర్ఎస్‌లో అధికారికంగా చేరలేదు. అయితే పార్టీ విధానాలకు ఆకర్షితులై పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించారు. తాజా చేరికలతో బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బలం పెరిగింది.

విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వెళ్తా

ప్రస్తుతం ప్రభుత్వం మరోసారి ఫార్ములా-ఈ కార్ రేసు కేసును తెరపైకి తెస్తున్నదని కేటీఆర్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే నాలుగుసార్లు పిలిచి వాళ్లు చేసిందేమీలేదని, మరోసారి తమాషా కోసమే పిలువబోతున్నారనే సమాచారం ఉన్నదని చెప్పారు. 'ఏసీబీ అధికారులు ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తా.. నిజాన్ని స్పష్టంగా చెప్తా.. నాకేం ఇబ్బందిలేదు' అని కుండబద్దలుకొట్టారు. ఈ కేసులో ఎలాంటి పసలేదని పోలీసు, ఏసీబీ అధికారులు సీఎం కు చెప్పారని, కానీ ముఖ్యమంత్రి రాజకీయ కక్షతో ఈ కేసును వాడుకుంటున్నారని విమర్శించారు. ఏదేమైనా భయపడ బోనని స్పష్టంచేశారు. జైలులో పెట్టినా బెదిరేదిలేదని తేల్చిచెప్పారు.

స్థానిక ఎన్నికల్లో అక్కడి సమస్యలు, ఇతర అంశాల ఆధారంగానే ప్రజలు తీర్పునిస్తరు. లోకల్‌బాడీ ఎన్నికలు అసెంబ్లీ ఎలక్షన్స్‌కు గీటురాయి కాదు. ఇందుకు ఎన్నో ఉదంతాలున్నయ్. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కుప్పంలో కూడా పోయింది. కానీ చివరికి ఏమైంది? అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయాలు నమోదు చేసుకున్నది. ఒక ఎన్నికకు, మరో ఎన్నికకు పొంతన ఉండదు. స్థానిక ఎన్నికల్లో ఒక్కోసారి సానుభూతి కూడా పనిచేయదు. -కేటీఆర్

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఇక పనైపోయిందని అడ్డగోలుగా మాట్లాడిన వారికి మొన్న పంచాయతీ, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ఫలితాలే సమాధానం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం నాలుగు స్థానాలకే పరిమితమైంది. రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఎన్ని స్థానాలు గెలిచారు?

# ఈశాన్య భారతంలో చరిత్రాత్మక ఘట్టం

**గువాహటి:**
దేశ రక్షణ వ్యూహంతో పాటు బహుళ ప్రయోజనాలు ఇమిడి ఉన్న ఒక చరిత్రాత్మక ఘట్టం శనివారం ఆవిష్కృతమైంది. ఈశాన్య రాష్ట్రమైన అస్సాం దానికి వేదికైంది. దిబ్రూగఢ్ జిల్లాలోని జాతీయ రహదారి-37పై ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఈఎల్ఎఫ్)ని ప్రధాని మోదీ ప్రారంభించారు. మోరాన్ బైపాస్ వద్ద రూ.వంద కోట్లతో తీర్చిదిద్దిన ఈఎల్ఎఫ్‌పై సి-130జే విమానంలో మోదీ ల్యాండయ్యారు. చైనాతో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈశాన్య భారతంలో నిర్మించిన తొలి వ్యూహాత్మక రన్‌వే ఇది. పౌర, సైనిక అవసరాలను తీర్చేలా దీనిని రూపొందించారు. అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగానూ ఉపయోగపడనుంది. ప్రకృతి విపత్తులు, సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు, విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌కు ఇది ఎంతో అనుకూలం. ఇప్పటికే పశ్చిమ, ఉత్తర, మధ్య భారత్‌లో ఇటువంటివి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ఇదే మొట్టమొదటిది. దిబ్రూగఢ్-మోరాన్ జాతీయ రహదారిపై ఉన్న రన్‌వే.. భారత్-చైనా సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో కీలక, వ్యూహాత్మక ప్రదేశంగా మారింది. చైనా సరిహద్దుకు 300 కి.మీ; మయన్మార్‌కు 200 కి.మీ. దూరంలో ఈఎల్ఎఫ్ ఉంది.

ఆకట్టుకున్న ఎయిర్ షో.. అస్సాం ఈఎల్ఎఫ్ రన్‌వేపై.. రఫేల్, సుఖోయ్, సీ-17 గ్లోబ్‌మాస్టర్ వంటి యుద్ధ విమానాలతో శనివారం ఎయిర్‌షో నిర్వహించారు. ప్రధాని మోదీ, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ తదితరులు తిలకించారు. అస్సాంలో ఈఎల్ఎఫ్ ప్రారంభం తనకెంతో గర్వంగా ఉందని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

అస్సాం పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ శనివారం బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన ఆరు వరుసల భారీ వంతెన(కుమార్ భాస్కర్ వర్మ సేతు)ను ప్రారంభించారు. అనంతరం దానిపై కొద్ది సమయంపాటు నడిచారు. ఈ వంతెన నిర్మాణానికి రూ.3,030కోట్లను వెచ్చించారు. ఐఐఎం-గువాహటి, హైటెక్ డేటాసెంటర్‌ను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు.

కాంగ్రెస్‌తో దేశ భద్రతకు ముప్పు.. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనే వారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసే వారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని ప్రధాని మోదీ విమర్శించారు. గువాహటిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ఆరోపించారు.

# ఇక జనరల్ బోగీల్లోనూ నిరంతరం శుభ్రత

**దిల్లీ:**
రైల్వే శాఖలో కొత్త సంస్కరణల్లో భాగంగా ఇకమీదట రిజర్వ్ బోగీలతోపాటు జనరల్ బోగీల్లోనూ ప్రతి గంటకోసారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఆయన శనివారం సాయంత్రం ఇక్కడి రైల్‌భవన్‌లోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తొలివిడతలో భాగంగా... దేశవ్యాప్తంగా 80 రైళ్లల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటిలో దక్షిణ మధ్య రైల్వే నుంచి 5 రైళ్లను ఎంపిక చేశారు. ఆరునెలల తర్వాత ఈ సౌకర్యాన్ని మరో 80 రైళ్లకు విస్తరిస్తామని, క్రమేణా మూడేళ్లలో అన్ని రైళ్లలోని జనరల్ బోగీలనూ శుభ్రపరిచే దిశగా వెళ్తామని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రైలు బయలుదేరిన చోటునుంచి గమ్యస్థానం చేరేవరకు రద్దీగా ఉండే సమయాల్లో ప్రతి గంటకోసారి, మిగతా సమయాల్లో గంటన్నరకోసారి శుభ్రత కార్యక్రమాలు కొనసాగించబోనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రయాణికులపై అదనపు ఛార్జీల భారమేమీ వేయబోమని స్పష్టంచేశారు. శుభ్రత కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతి రైలులో ఒక ప్రొఫెషనల్ బృందాన్ని, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఈ కంట్రోల్‌రూం ద్వారా రైళ్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు ఏఐ ఆధారంగా పరిశీలించి సేవల నాణ్యతను మదింపుచేయనున్నట్లు చెప్పారు. రైళ్లలో దిండ్లు, దుప్పట్ల సరఫరాతోపాటు, చిన్న చిన్న రిపేర్ పనులన్నింటినీ ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని వెల్లడించారు. రైళ్ల పరిశుభ్రత కోసం నియమించే సిబ్బందికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీచేయనున్నారు. ఈ పనులను పర్యవేక్షించే సూపర్వైజర్ కనీసం 12వ తరగతి లేదంటే ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.

# హంగ్ మున్సిపాలిటీల్లో హార్స్ ట్రేడింగ్

## అప్పుడే బేరసారాలు మొదలు

**హైదరాబాద్,ఫిబ్రవరి14:**
తెలంగాణ వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్‌లు,116 మున్సిపాలిటీ లకు బుధవారం ఎన్నికలు జరుగగా.. శుక్రవరాంఓట్ల లెక్కింపు పక్రియ కొనసాగుతోంది. మొత్తం 136 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతోంది. మధ్యాహ్నం 3 గంటల వరకు వెల్లడి అయిన ఫలితాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ 90కి పైగా మున్సిపాలిటీల్లో, బీఆర్ఎస్ 24 మున్సిపాలిటీల్లో విజయాలు సాధించాయి. అయితే పలు చోట్ల అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మధ్య గట్టిపోటీ నడుస్తోంది. ఏ పార్టీ మ్యాజిక్ ఫిగర్ అందుకోక కొన్నిచోట్ల హంగ్ ఏర్పడింది. దాంతో ఆయా మున్సిపాలిటీల్లో హార్స్ ట్రేడింగ్‌కు తెరలేచింది. మ్యాజిక్ ఫిగర్ కోసం అప్పుడే బేరసారాలు మొదలయ్యాయి. చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో స్వతంత్రులు, ఎక్స్ అఫిషియో సభ్యులు కీలకం కానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు మొత్తం 16 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. ప్రజలు హంగ్ తీర్పు ఇచ్చిన మున్సిపాలిటీల్లో పరకాల, అలంపూర్, నర్సాపూర్, జిన్నారం, కేసముద్రం, ఇస్నాపూర్, ఆసిఫాబాద్, జమ్మికుంట, జనగామ, కామారెడ్డి, అమరచింత, కోహీర్, దేవరకద్ర, ఆసిఫాబాద్, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, మహబూబాబాద్, ఆలియాబాద్, బోధన్, గద్వాల, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీ తన ఖాతాలో 24 మున్సిపాలిటీలు వేసుకుంది. సంగారెడ్డి జిల్లాలోని గడ్డపోతారం, ఇంద్రేశం, గుమ్మడిదల.. జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ, మహబూబాద్ జిల్లాలోని తొర్రూరు, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఎల్లంపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ నేరేడు చర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, అశ్వారావుపేట, స్టేషన్ ఘన్‌పూర్, ఆందోలు-జోగిపేట, సదాశివపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర మున్సిపాలిటీల్లో గెలిచింది.

కాగా అనూహ్య రీతిలో వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకుంది. ఇక ఇతర పార్టీలు ఏ మున్సిపాలిటీలోనూ అధికారానికి దరిదాపుల్లో లేవు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేట మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని 24 వార్డులకు గాను బీఆర్ఎస్ 12, కాంగ్రెస్ 8, బీజేపీ 4 స్థానాలను దక్కించుకుంది. బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలు విస్తృత ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు అవిరాళంగా కృషి చేశారు.

# ఫీజు బకాయిలపై మండలిలో వాడీవేడి చర్చ

## బకాయిలపై అధికార, విపక్షాల పరస్పర విమర్శలు
## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ విపక్ష నేత బొత్స
## బొత్స తీరును తప్పు పట్టిన మంత్రి లోకేశ్
## నిరసనగా వైసిపి సభ్యుల వాకౌట్

అమరావతి,ఫిబ్రవరి14:
ఫీజు బకాయిలపై మండలిలో వాడీవేడి చర్చ సాగింది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరగింది. బకాయిలు చెల్లిచడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ విపక్ష వైసిపి సభ నుంచి వాకౌట్ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అసత్యాలు మాట్లాడుతుందంటూ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఫైర్‌అయ్యారు. తమకు వాకౌట్ చేయటం ఫ్యాషన్ అని కొందరు మాట్లాడుతు న్నారని.. అది ఫ్యాషన్ కాదని, అలా చేస్తే అయినా కూటమి ప్రభుత్వంలో మార్పు వస్తుందని భావిస్తున్నామని తెలిపారు. తాము సమాధానాలు చెప్తే వినాలని.. అవాస్తవాలు మాట్లాడటం సరికాదన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రశ్నకి ప్రభుత్వం నుంచి సరైన సమాధ్యానం రాకాపోవడంతో సభ నుంచి వైసీపీ సభ్యులు వాకౌట్ అయ్యారు. మండలిలో వైసీపీ ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ 'రూ.8500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయి. ఇప్పటికి కేవలం రూ.700 కోట్లు మాత్రమే కూటమి ప్రభుత్వం చెల్లించింది. ఇంకా రూ.7800 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి. వైఎస్ జగన్ హయాంలో ఎప్పటి బకాయిలు అప్పుడే చెల్లించారు. కూటమి ప్రభుత్వం 8 విడతల బకాయి పెట్టింది' అని అన్నారు. మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ?'అసలు మేం బకాయిలు పెట్టలేదని వైసీపీ సభ్యులు అవాస్తవాలు చెప్తున్నారు. ఏ క్వార్టర్ కు ఆ క్వార్టర్ చెల్లింపులు చేశామనడం అవాస్తవం. ఇప్పటి వరకు రూ.1859 కోట్లు చెల్లించాం. ఈ విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల బకాయిలు పూర్తిగా చెల్లించాం. కాలేజీలకు ఇప్పటికే చెల్లింపులు చేసిన విద్యార్థులకు వారి ఖాతాల్లోకి నగదు వేస్తాం. గతంలో కొన్ని తప్పుడు విధానాల్లో అప్పటి ప్రభుత్వం చెల్లింపులు చేసింది. అన్నింటినీ అధిగమించి ముందుకు వెళ్తున్నాం' అని చెప్పారు. విపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ 'గత ప్రభుత్వ హయాంలో నాలుగు వేల కోట్లు బకాయి ఉందని చెప్పటం అవాస్తవం. ఎన్నికల కోడ్ రావటంతో ఒక్క క్వార్టర్ మాత్రమే బాకాయి పెట్టాం. అది కూడా అప్పటి ప్రతిపక్షం ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయటం వల్ల మాత్రమే పెండింగ్ పెట్టాల్సి వచ్చింది. అసలు ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు ఎప్పటిలోపు చెల్లిస్తారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ? 'విపక్షనేత బొత్స గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేవని చెప్పిన దానిలో నిజం లేదు. మేము అన్నీ రికార్డుల ప్రకారమే మాట్లాడుతున్నాం. విద్యాశాఖ మంత్రిగా వాస్తవాలు చెప్పే హక్కు మాకుంది. గత ప్రభుత్వం 4064.59 కోట్లు బకాయలు పెట్టి వెళ్ళింది. నేను మాట్లాడిన దానికి అన్నీ ఆధారాలు సభ ముందు ఉంచుతాం అని అన్నారు.

# పుల్వామా దాడిని ఖండిస్తూ ఏఎస్ రాజు నగర్‌లో రక్తదాన శిబిరం..





ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :

పాక్ ఉగ్రమూకల దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగి అమరులైన బ్లాక్ డే రోజు సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆ వీరులను స్మరించుకుంటూ యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఎ.ఎస్ రాజు నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రమూకల దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగన అమర వీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పిస్తున్నాం అన్నారు. అమర వీరుల ప్రాణాలు వెలకట్టలేనివని, యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మహా రక్త దానం శిబిరం నిర్వహించడం వారికి మనం ఇచ్చే ఘన నివాళులని యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ వారు అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని కొనియాడారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం చాలా సంతోషకరమైన విషయం అని, మంచి స్పందన వచ్చినది అని అన్ని దానంల కన్నా రక్తదానం గొప్పదని, ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తప్పనిసరిగా రక్తదానం చేయాలని, నిండు ప్రాణాలను కాపాడినవారు అవుతారని చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ గవ్వల భారత్ కుమార్, హైదరాబాద్ కన్వీనర్ రుద్ర అభిరామ్ గౌడ్, కో కన్వీనర్ శివ గౌడ్, ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించగా నాయకులు, సంజీవ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, దొడ్ల రామ కృష్ణ గౌడ్, శివరాజు గౌడ్, పోశెట్టి గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిగూడలో జరిగిన గ్యార్వి షరీఫ్ ఉత్సవాలలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



గ్యార్వి అంటే ఉర్దూలో 11 అని అర్థం. హజ్రత్ అబ్దుల్ ఖాదిర్ జిలాని గౌరవించి వారి త్యాగాలను స్మరించుకుంటూ జరుపుకునే వేడుక. ఈ రోజున ప్రత్యేక ప్రార్థనలు, నియాజ్, ఖురాన్ పఠనం, తో పాటు దానధర్మాలు చేస్తారు. ఈ పండుగ భక్తిని శాంతిని దైవచింతలను పెంపొందిస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు. మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అటువంటి గ్యార్వి షరీఫ్ ఉత్సవాల వేడుకలను శనివారం రాత్రి ఘనంగా జరిపారు జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్ కాలనీ డివిజన్ ఎల్లారెడ్డిగూడా లో మైనార్టీ నాయకులు సయ్యద్ జావిద్ హుస్సేన్, సీనియర్ నాయకులు షేక్ అహ్మద్. ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ని ఆహ్వానించారు వారి ఆహ్వానం మేరకు వి.నవీన్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వి.నవీన్ యాదవ్ కు వారి పద్ధతి ప్రకారం ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ తాహేర్,మొహమ్మద్ నసిర్, అభేడ్ హుస్సేన్, షాహిర్ హుస్సేన్, సయ్యద్ కలీం షాబుద్దీన్,జాఫర్ షేక్ జావిద్ హుస్సేన్ లు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. ఎల్లారెడ్డి గూడ లా కాలేజీ ఎదురుగా ఉన్న చిల్లా నుండి అమీర్పేట్ సర్కిల్ వరకు వెళ్లి మళ్లీ ఎల్లారెడ్డి కూడా వీధుల గుండా చిల్లా వద్దకు వచ్చి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటె మీద యువకులు జెండా పట్టుకుని ముందుకు సాగారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి శాలువాతో ఘనంగా సన్మానించారు కమిటీ నిర్వాహకులు. అల్లా అల్లా అంటూ ప్రార్థనలు చేస్తూ, ఒకవైపు బ్యాండు, మరొకవైపు డీజే, ఇంకొక వైపు రకరకాల వాయిద్యాలు చేస్తూ ఎల్లారెడ్డి గూడ పుర వీధుల గుండ డాన్సులు వేస్తూ ముందుకు సాగారు మైనారిటీ యువకులు. ముందస్తు చర్యలు లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు బంగం కలవకుండా పోలీస్ సిబ్బంది ని ఏర్పాటు చేశారు మధురానగర్ పోలీస్ స్టేషన్ సిఐ హెచ్. ప్రభాకర్. ఈ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ నియాజ్( అన్నదానం) ఏర్పాటు చేశారు నిర్వాహకులు.

## గ్యార్వి షరీఫ్ ఉత్సవాలలో పాల్గొన్న

# మాజీ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్..






ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :

గ్యార్వి షరీఫ్ ఉత్సవం అనేది ముఖ్యంగా హిందూ ముస్లింల సోదరులు సమైక్యతతో జరుపుకునే ఒక విశేషమైన పవిత్రమైన వేడుక. అటువంటి గ్యార్వి షరీఫ్ వేడుకలను తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్ కాలనీ డివిజన్ ఎల్లారెడ్డిగూడెంలో ఘనంగా జరిపారు మైనారిటీ నాయకులు. ఈ కార్యక్రమం జావిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తాను ఒక భాగమయ్యారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ అహ్మద్.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు మాజీ కార్పొరేటర్( సోమాజిగూడ డివిజన్) వనం సంగీత శ్రీనివాస్ యాదవ్. ఈ ఉత్సవాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వనం శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. వచ్చిన అతిథులకు శాలువాతో ఘనంగా సన్మానించారు కమిటీ నిర్వాహకులు. ముస్లిం మైనారిటీ నాయకులు చేసిన ఫతేహ ప్రార్థనలు తో పాటు జెండా పట్టుకుని ఒంటె మీద ప్రార్థనలు చేస్తూ ఎల్లారెడ్డి గుండా వీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ తాహెర్,షేక్ అహ్మద్, మొహమ్మద్ నసీర్, షాహీర్ హుస్సేన్, అభేడ్ హుస్సేన్, జహీర్ అహ్మద్, సయ్యద్ కలీం, షాబుద్దీన్,, జాఫర్ షేక్,, జావేద హుస్సేన్, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు పాత్ర పోషించారు. పెద్ద ఎత్తున ముస్లిం యువకులు అల్లా అల్లా అంటూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా సెంట్రల్ జోన్ పంజాగుట్ట సీఐ రాంప్రసాద్ సూచనలతో కింది స్థాయి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మైనారిటీ యువకులు చేసిన నృత్యాలతో కార్యక్రమం జరిగిన చిల్లా (లా కాలేజీ ఎదురుగా ఉన్న) ప్రాంతం మొత్తం భక్తిమయమైంది. వచ్చిన అందరికీ నియాజ్ ఏర్పాటు చేశారు కమిటీ నిర్వహకులు. ఈ కార్యక్రమంలో హిందూ సోదరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ ప్రభంజనం

# రానున్న గ్రేటర్ ఎన్నికల్లో కొనసాగిస్తాం..



## - మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రభంజనంను అంతే ప్రభంజనంతో త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సాధిస్తామని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. శనివారం బాలానగర్ డివిజన్ లోని ఇందిరానగర్ లో బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్లోని బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపట్ల బూత్ స్థాయి కార్యకర్తలతో విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ ప్రతీ ఒక్క బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేసే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కార్యకర్త తనకు అప్పజెప్పిన పనులను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, కాంగ్రెస్ పార్టీ అభిమానులను, సానుభూతి పరులను తక్షణమే గుర్తించి వివరాలను సేకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ యుద్ధం జరుగుతున్న సమయంలో సైన్యంలో సైనికులు ఏవిధంగా నైతే విరచిత పోరాటం చేస్తూ ముందుకు సాగుతారో అదే విధంగా కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు కూడా అలాగే వీరోచితంగా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఒక మాటలో చెప్పాలంటే సర్జికల్ స్ట్రైక్ ఏవిధంగా జరిగిందో అదేవిధంగా బూత్ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు సర్జికల్ స్ట్రైక్ చెయ్యాలని పిలుపునిచ్చారు. కష్టపడితే విజయం తథ్యమని, ఇప్పటి నుండే కార్యాచరణను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బంధిగా నరసింహ, మైనారిటీ నాయకులు అడ్వకేట్ హుస్సేన్,ఆకుల నరేందర్ ముదిరాజ్, మట్టే ప్రసన్న కుమార్, ఓ బి సి నరేష్,మాదరీ శ్రీనివాస్, ముప్పురి బాలరాజు,సోనూ అర్షద్, గజానంద్ శేఖర్, జిల్లా శివ, ఇమ్రాన్,ముస్తఫా, సోహైల్, అక్రమ్, రుక్ముద్దీన్, జమ్మూ, శ్రీకాంత్, పీటర్,రాము, షేక్ సావుద్ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలను పరిశీలించిన మన్నె గోవర్ధన్ రెడ్డి..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



ఖైరతాబాద్ నియోజకవర్గ బి.ఆర్. ఎస్.పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఖైరతాబాద్ డివిజన్ మహాభారత్ నగర్, బి జె ఆర్ నగర్,ఇంద్రనగర్‌లో ఉన్న స్థానిక డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు, సీసీ రోడ్స్, సమస్యల తో పాటు మైదానం పక్కన ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు ఎలాంటి రక్షణ లేకపోవడం వంటి సమస్యలను నేరుగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా నా ప్రయత్నం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షులు ఆనంద్, అంజన్ కుమార్, కుమార్, కృష్ణ ,వినీత్ కుమార్,సురేందర్, అశోక్, చారి, ఉస్మాన్, పాల్గొన్నారు.

## బలరాముడు పుట్టినరోజు వేడుకల్లో

# ముఖ్య అతిధిగా పాల్గొన్న మంతపురం కమలాకర్

ఎ ఎం న్యూస్ పటాన్చెరు :



పుట్టినరోజు అనేది కేవలం సంబరం మాత్రమే కాదు. గత ఏడాది జరిగిన మంచి చెడులను గుర్తు చేసుకుంటూ రాబోయే కాలంలో మరింత ఉత్తమంగా జీవించడానికి ప్రేరణ పొందే రోజు. వివరాల్లోకెళ్తే సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం రాంచరణ్ నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ పరిధిలోని ఉస్మాన్ నగర్ సమీపంలో ఉన్న రెండు పడకల సముదాయం ఫేస్ 2( డబల్ బెడ్ రూమ్ ఫేస్ టు) లోని 97 వ బ్లాక్ ( ఫ్లాట్ నెంబర్ 210) లో నివాసం ఉంటున్న బలరాముడు పుట్టినరోజు(అదివారం)ను గుర్తు పెట్టుకొని ఫేస్ 2 లోని వారి మిత్రులు ప్రత్యేక కేక్ తెప్పించి బలరాముడుతో కేక్ కట్ చేపించి వారికి తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బలరాముడు పుట్టినరోజు వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొనవలసిందిగా తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్‌కి ముఖ్యుడు, మనసున్న మంచి మనిషి మంతపురం కమ లాకర్‌కి ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు బలరాముడు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు మంతపురం కమలాకర్.ఈ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన వారిలో సయ్యద్ సిరా జుద్దీన్ (6వ సెక్టర్ అధ్యక్షుడు), సయ్యద్ సుభాని (సెక్టర్ సభ్యుడు), రామిరెడ్డి (వైస్ ప్రెసిడెంట్), అనిస్ ఫాతిమా(సిక్స్త్ సెక్టార్ ట్రెజరర్), సాదిక్ (జాయింట్ సెక్రెటరీ)తో పాటు జకీర్ యూసఫ్ రహీం రఫిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టినరోజు చేసుకున్న బలరాముడు మాట్లాడుతూ ఈరోజు ఇంతమంది మిత్రుల మధ్య జరిగిన ఈ పుట్టినరోజు వేడుక నాకు గుర్తుండే వేడుక అని అన్నారు.

## తమ సమస్యలు

# పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తాం

## గ్రేటర్ హైదరాబాద్ రిగ్ ఓనర్స్ అసోసియేషన్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని గ్రేటర్ హైదరాబాద్ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ వారు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రిగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుండి నిరవధికంగా సమ్మె జరుగుతుందని వారు స్పష్టం చేశారు. బోర్లు వేస్తున్న సమయంలో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఎంతోమంది నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా స్పేర్ పార్ట్స్ రేట్లు గాని, పైపులు, బిట్స్, హామర్స్, డీజిల్, ఆయిల్, లేబర్ ధరలు పెరగడం వల్ల నిరవధిక సమ్మె జరుగుతున్నట్లు తెలియజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రిగ్స్ మొత్తము ఆరున్నర నాలుగున్నర రోబోలను మొత్తం నిలిపివేసినట్లు తెలియజేశారు. ఈ విషయాన్ని వినియోగదారులు, కంపెనీవారు గ్రహించి తమకు సహకారం అందించాలని మనవి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ముసుకు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి నర్సిరెడ్డి, కోశాధికారి మోహన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,సభ్యులు డి నరసింహ ముదిరాజ్, విష్ణువర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, రాము, శ్రీనివాసరావు, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, సిద్ధిరామిరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ మద్యంపై అసెంబ్లీ వాడీవేడీ చర్చ

### సంపూర్ణ మద్యనిషేధం పేరుతో ఏరులా పారించిన వైసిపి

### అసెంబ్లీలో మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం

**అమరావతి,ఫిబ్రవరి14:**

ఏపీ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సభలో ప్రశ్నోత్తరాల్లో కల్తీ మద్యంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి కొల్లు రవీంద్ర సమాధానం ఇచ్చారు. కల్తీ మద్యంపై ఏపీ అసెంబ్లీలో వాడీవేడిగా చర్చలు జరుగుతున్నాయి. కల్తీ మద్యానికి సంబంధించి 29 కేసులు నమోదు చేశామని తెలిపారు. కల్తీ మద్యం తరలింపునకు ఉపయోగించిన 34 వాహనాలను సీజ్ చేశామని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో ఇతర రాష్ట్రాల నుంచి ఏపీకి తీసుకొచ్చిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై 31,081 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసుల్లో రవాణాకు ఎన్‌డీపీఎల్ అక్రమ రవాణాకు ఉపయోగించిన 10,232 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. కల్తీ మద్యం స్కాంపై 13 ల్యాబ్‌లలో సిట్ అధికారులు పరిశీలించిన తర్వాతే విచారణ చేస్తున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ఎన్నికల ముందు సంపూర్ణ మద్యనిషేధం అని చెప్పి తర్వాత రేట్లు పెంచారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో మద్యం ధర పెంచారని.. చాలా మంది ఈ ధరలు చెల్లించలేక జంగారెడ్డిగూడెం లాంటి చోట కల్తీ మద్యం తాగి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సరఫరాను నాడు అంతా ఒక మాఫియాలా చేశారని ఆరోపించారు. ములకల చెరువు కల్తీ మద్యం కేసులో వైసీపీ హయాంలో మంత్రులుగా పనిచేసిన వారు కూడా నిందితులుగా ఉన్నారని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వంలో ఎక్కడ కల్తీ లిక్కర్ సరఫరా జరగకుండా నవోదయం పేరుతో క్యాంపెయిన్ చేస్తున్నామన్నారు.

జగన్ హయాంలో దశలవారీ మద్యం నిషేధమని చెప్పి తుంగలో తొక్కిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఈ కేసులో ముద్దాయిల్లో విజయసాయి రెడ్డి ఒకరిగా ఉన్నారని ప్రస్తావించారు. కింగ్ పిన్, ఆయన వెనుక ఉన్న కింగ్ ఎవరో ఈ కేసులో బయటకు రావాలని చెప్పారు. రూ.3,500 కోట్ల స్కాంలో 360 రోజులయినా బెయిల్ ఇవ్వమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని అన్నారు. కేసుపై సిట్ అధికారులు విచారణ చేస్తున్నారని.. ఈ స్కాంలో రూ.3500 కోట్లు కుంభకోణం జరిగినట్లుగా తెలుస్తోందన్నారు. మద్యం ధర పెంచితే తాగరనే సాకుతో నాణ్యమైన మద్యాన్ని మందుబాబుల నుంచి దూరం చేశారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నాణ్యమైన మద్యాన్ని రూ.99లకే అందిస్తోందని చెప్పుకొచ్చారు. జగన్ హయాంలో తప్పు చేశారని.. నాటి ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధమైన విధానం మంచిది కాదని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.